# ఠవర

పెందరాడే ఇంటికి బయలుదేరాను. రామచంద్రం తన పాత ప్రియురాలు అనసూయను గురించి చెబుతున్న కబుర్లనూ, చెరువు అలలమీద చెదురుతూ పడే అస్తమయపు గోముకాంతినీ, పచ్చ పట్టుపరుపువలె గాలికి ఊగే విశాలమైన వరి పొలాలనూ వొదిలి.

"అప్పుడే !" అంటున్నాడు రామచంద్రం, తన ముఖ్య శ్రోతను వదులుకోలేక.

"వెళ్ళాలి"

"ఎందుకో ? "ఆ" కోసం కాదుగదా ? అవునా ? అయితే వెళ్లు. ఇంకోందుకా ? విరిచి కూచోబెడతాను."

నాకున్న పురుషత్వంమీద అమోఘమయిన నమ్మకమున్న వాళ్ళల్లో రామచంద్రం ఒకడు. కాదని చెబితే పోవటానికి వొప్పడని, నిజమేనని అబద్ధం కూసి ఇంటికొచ్చాను.

మా ఆవిడ వాకిట్లోనే ఎదురయింది.

"తొరగా కానివ్వు స్నానం, మంచి చీర కూడా కట్టుకో."

"ఎందుకు ?" అన్నట్టు నావేపు చూసింది.

"సినిమాకు—గొప్ప..." నా ఉత్సాహం సగంనుంచే దిగజారిపోయింది. సినిమాలంటే ఎగిరి గంతేసే నరుసు, సినిమాలను అసహ్యించుకునే నేను గొప్పదని చెబుతున్నా చలించని దాని తత్వం నన్ను ఆశ్చర్యపరచింది.

"ఏమిటీ ఆలోచిస్తున్నావు ?"

"ఏమీ లేదు" అన్నది మా ఆవిడ. నావేపు వొక చురుకు చూపు చూసి "మీ కెందుకా భయం ? నే నేది ఆలోచించి మాత్రం ఏం చేయగలుగుతాను ? ఆ సంగతి తెలిసే మీరు ప్రవర్తిస్తున్నారు... నే నిట్లా ఆలో

చిస్తూనే ఉంటాను. మీరు మీ వ్యవహారమేదో జరుపుకొంటుంటారు. నా ఆలోచనలు మీ వ్యవహారాలకేమీ అడ్డం రావుగా !"

చచ్చాను. దేవుళ్ళమీద నాకు నమ్మకం పోకుండా ఉన్నట్లయితే మా ఆవిడ కోపాన్ని తగ్గించమనీ, కనీసం కోప కారణమేమిటో చప్పున తెలియచెయ్యమనీ ప్రార్థించి ఉందును.

"అసలు సంగతి..." నీళ్లు నములుతున్నాను. ఆఫీసులో గుమాస్తాలను నీళ్లు నమిలించి, వొణికేట్టు చెయ్యగలిగిన నేను.

"ఏమీ తెలీనట్టు...?" అన్నది నరసు క్రింది పెదిమ కొంచెంగా లోపలికి తీసుకుని కొరుకుతో. ఆ పెదిమ నాది కాకూడదా అనిపించింది క్షణకాలం.

"పిల్లి పాలుతాగుతూ ఎవ్వరూ చూడటల్లేదనుకుంటుంది. తప్పులేదు. తనకెవ్వరూ కనిపించటంలేదు గనక, తనుగూడా ఎవరికంటా పడనని దాని గుడ్డి నమ్మకం. కానీ మనుష్యుల్లో గూడా అటువంటి బుద్ధిలేని వాళ్లున్నారంటే..."

ప్రవాహం ఆగేట్టు లేదు. ఒక విధంగా ఆ ధోరణి నాకు ముచ్చటగానే ఉంది. నరసుకు కోపమొచ్చింది ఎందుకో నా మీద. అందువల్ల ఆమె ముఖం కందింది. కళ్లు కొంచెం ఎరుపెక్కాయి. మాటి మాటికీ పెదిమలు తడుపుకొంటున్నది. పమిట సరిచేసుకుంటున్నది. ఎటువంటి స్థితిలో ఉంటేనేం నరసు; లోగడ నేను అనుభవించిన, అందమైన భుజాలక్రింద ఉన్నతాలు, స్పర్శతో, నవ్వుతో, నొక్కుతో, నాలో, కరువ్వలు ప్రవహింపించి, ఊపిరినే ఆపగల, వొంకర చిన్ని పెదిమలూ, అంత దగ్గిరిగా ఉన్నప్పుడు ?

"ఇన్నిటికీ..." అన్నాను కలలోనించి తప్పించుకుని.

"అదే ! ఆ అమాయకత్వమే, ఆ నటనే, నన్ను మోసగించింది ఇంత కాలం."

"నేనా ? మోసం చెయ్యటమా ?. నిన్నా ? నా ప్రాణమైన, జీవితమైన నిన్నా ?"

"బస్. కవిత్వం ఆపండి" అన్నది నరసు. "ఇంతకాలం పొరపాటు పడ్డాను. ఇంకానా ? ఇకమీద కూడా నన్ను ఆ మాటల చతురతలో ముంచి

నిజాన్ని కనుక్కోకుండా ఆపలేరు. కొంతకాలం అందరినీ మోసగించటం సులభం. అన్ని కాలాలూ, కొంతమందిని మోసగించటం గూడా సులభమే. కానీ, అన్ని కాలాలలోనూ అందర్నీ మోసగించటమనేది ఎక్కడా జరగదు. కాబట్టి..." అని పెదిమ మళ్లీ కొరికి తల వెనక్కూ ముందుకూ ఆడించింది.

నువ్వు నమ్మవా ? ఏడుద్దామనిపించి గూడా ఏడవలేకపోతున్నాను నేను. ఒక్క సారి అసలు విషయమేమిటో చెప్పి, నన్ను తిడితే, అసహ్యించుకుంటే, పలక్కుండా ఉంటే ఇంతబాధ పడకపోదును. సస్పెన్సులో యిరికించి, కొద్ది కొద్దిగా హింసబెడుతున్నది నగుసు.

"పిచ్చిముండను—ఇంకా ఇదంతా ప్రేమతోటేమో ననుకున్నాను... ఇన్నేళ్లు మీతో కాపరం చేసిగూడా, మీ ప్రవర్తనను గ్రహించలేకపోయాను"

నేను నిలబడ్డ భూమి హఠాత్తుగా కుంగితే, దూలం విరిగి నా మీద పడితే, గుండె ఆగి చస్తే, ఈ రెండు గోడలు, జరజరా కలుసుకుంటే ?

"నిజం—నే ననుకోవటం ఆ చీర మీరు ప్రేమతో తెచ్చారని."

"కాదా ? కోపంతో తెచ్చానా ? అట్లా కనిపించటానికి నీకు, ఏ జన్మలో ఏ మహా పాపకార్యం చేశాను నేను ?" అన్నాడు ఈ దౌర్భాగ్యుడు నరుసుకు సమాధానంగా.

నరుసు పక పక నవ్వింది. నవ్వేప్పుడు అందంగా కంపించే ఆ వక్షాల విశాలత్వం, మెడక్రింది నునుపు ముడత, పెదిమపక్క...

"ఈ జన్మలోవి చాలకా, పూర్వజన్మలవి ఎరువు తెచ్చుకోవటం ?" అన్నది నరుసు. "కాని పురుషులంటే మిమ్మల్నే చెప్పుకోవాలెనండీ !"

ఈ మాట యిప్పుడు కాదు అనవలసింది. ఈ మెప్పు; నా వేళ్ళు ఆమె పెదిమలపై శృతులు నొక్కుతున్నప్పుడు ఎటూ కదలనివ్వక, ఊపిరి పీల్చనివ్వక, కాలాన్నే ఆపి, లోకాతీత ఆనందాలు, చేరువగా, మీ కోసమే అన్నట్లు బాహువులు సాచి ఆహ్వానించినప్పుడు అంటే ! సూర్యుడు పడమట ఉదయించాడా ? హిమాలయం "లావా" వెళ్ళగక్కుతోందా ? నిప్పు చినుకులు రాలుతున్నాయా ? ఏమయితేనేం ? నాకేం సంబంధం ? అందును.

"పాతిక రూపాయల చీర అడగకుండానే తెచ్చినందుకు, ప్రతిరోజూ పూలు తెస్తున్నందుకు మురిశాను. కానీ ఈ తెరతో నా కళ్లు కప్పుతారని అనుకోలేదు."

"ఏం తెర ?"

అన్నాను. ఇంకా నయం, అనగలిగాను!

"అదే అదే!" అన్నది నరసు విరగబడి నవ్వి. "ఓహో ఏంచక్కా నటిస్తారండి ? నా మాట విని సినిమాల్లోకి వెళ్ళండి, ఆంధ్రదేశం మీకు జోహార్లు చేస్తుంది."

ఇంకా చావనేం ?

"పోనీ ఒకమాట చెప్పండి, నే నేమీ అనుకోనులే...అనుకున్నా మీకు నష్టంలేదుగా ?"

"ఏమిటి ?"

"ఏం ఆశ్చర్యం చూపెడుతున్నారండీ ? పోనీండి పాడుగోల...ఆఁ... ఇది చెప్పండి—శకుంతలకూ, మీకూ ఎంత కాలంనుండీ సంబంధం ?" అన్నది నరసు రెండు చేతులూ నడుముకు రెండువేపులా ఉంచి, మెడ ఎడమ వేపుకు కొంచెం వంచి, మెల్లిగా నవ్వుతో.

ఒకప్పుడు ఇది ప్రణయ భంగిమమే అయినా నేడు మాత్రం ప్రళయ భంగిమంగా తోచింది.

"ఏ. శకుంతల ?"

అదిరి పడ్డాను.

"ఇంటిపేరు కూడా కావాలా ? కావాలి గావును—మీకున్న ప్రియురాళ్ళలో శకుంతల పేరుగల వాళ్ళెంతమంది ఉన్నారో ? ఒట్టి "శకుంతల" అంటే మీరు మాత్రం ఏం చెప్పగలుగుతారు పాపం!" అన్నది నరసు నిట్టూరుస్తున్నట్లు. "అదే! వీధిచివర శకుంతల, రెండేళ్ళ క్రిందట భర్త చచ్చిన శకుంతల—సంవత్సరంనుంచా ? ఆరునెల్లా ? పోనీ మూడునెల్లా ? మూడు నెలలే గావును ? అవునాండి ? ఇంకా ఎక్కువా ?"

ఏమనను ? దీని అనుమానాన్ని ఎట్లా రహితం చెయ్యగలను ? ఈ వీధిలో "శకుంతల" అనే మనిషి ఉన్నదనే సంగతే నాకు తెలియదంటే నమ్ముతుందా, ఎన్ని ప్రమాణాలు చేస్తే మట్టుకేం నేను ?

"మాట్లాడరేం ? ఓహో ! శకుంతల పేరు వినంగానే, మోహా మావేశించింది గావును. అక్కడ ఆమెతో ఎవరూ లేని ఆ యింట్లో మీరు గడిపిన శృంగార జీవనమంతా జ్ఞప్తికొచ్చింది గావును. అవునాండి ?"

నాకు చావురాదు.

"నువ్వు..."

ఏదో అనబోతున్నాను.

"నేను—ఊఁ. నేను ఏమిటో చెప్పండి ? దాని విషయం అడిగే హక్కు లేదంటారా ? పోనీ ఆ మాటన్నా చెప్పండి. నోరు నొక్కుకుంటాను అదేనా ?"

"అనవసరంగా అంటున్నావు నన్ను. నాకు తెలీదు ఏ శకుంతల గూడా !"

"ఏ శకుంతలనో గురించి కాదండీ నే నంటున్నదీ ? మన వీధి చివర ముండమోసిన శకుంతలను గురించి ! ఎర్రగా, నొక్కుల జుట్టు శకుంతలను గురించి. ఏమి చేసినా, ఎవరూ అడ్డు పెట్టటానికి లేని శకుంతలను గురించి" అన్నది నరుసు కోపంగా. ఈ దఫా ఆమె మరింత ఉద్విగ్నురాలయింది.

"ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను. ఇంతవరకూ ఆ మనిషిని నేను చూడలేదు. నువ్వు దేనిమీద ఒట్టు వేసుకోమంటే, దానిమీద వేసుకుంటాను" బహుశా నా కంఠం ఏడుపు ధ్వనించి ఉండొచ్చు.

"రంకు నేర్చిన తర్వాత బొంకు నేర్వకపోతే ఎట్లా ? ఇప్పుడు మీరున్న స్థితిలో దేనిమీద వొట్టు వేసుకోవటానికైనా సిద్ధపడతారు ? ఆరు నెలలా ? అయినా ? నాలుగా ? మూడు—అవునా ? కాదా ? పోనీ మీరు చెప్పండి. నేను నమ్మతానుగా !"

అంత విశ్వాసమే నా మీద ఉంటే ఏ పాప మెరగనని అంటున్న ఈ మాట ఎందుకు నమ్మదూ ?

"ఇంతవరకూ ఆ పిల్లనే చూడలేదు. అమ్మతోడు, భగవం..."

"అబ్బో ! మనకు భగవంతునిమీద మహా విశ్వాసముండి చచ్చినట్లు. ఈ వేషాలకేం గానండీ, చెబుతురూ వేధించి చంపక-ఎన్ని నెలలన్నారూ ?"

కాళ్ళమీద పడదామనిపిస్తోంది.

"నే నే పాపమూ ఎరగనే!"

"అవునవును–ఏ పాపమూ ఎరగరు. శకుంతల రంగేళీ ముండనీ తెలీదు. మొన్నటిదాకా ఆ సీతాపతి ఉంచుకున్నాడనీ మీకు తెలీదు. నడివీధిలో గుండా పోతే నలుగురూ ఏమన్నా అనుకుంటారని, పాడుబడ్డ దొడ్లలో గుండావచ్చి, వాళ్ళ పెరటిగోడ, జామచెట్టు పక్క నే దూకి, లోపల జొరబడటమూ మీకు తెలీదు. నమ్మననిగానీ, లేకపోతే, ఆ యిల్లెటో గూడా నాకూ తెలియదని, అనరుటండీ మీరూ?"

ఇదివరకు అనేవాణ్ని, అందామనే ఉంది. కానీ ఇప్పుడు ఎట్లా అనను?

"పోనీలెండి ఎవరి మనసొచ్చినట్లు వాళ్ళు పోతుంటారు. అసలు మీరు మంచివాళ్ళయితే..." అన్నది నరుసు నా దగ్గిరిగావచ్చి—చాలా దగ్గిరిగా "ఈ వొక్క సంగతి చెప్పండి. మిమ్మల్నింకేమీ అడగను. చెబుతారు గదూ? నామీద వొట్టే! అబద్ధం వొద్దు. ఈ చీర అది కొన్నదేనా? మీరు కొన్నదా? మీరేనా? అయితే అది డబ్బిచ్చిందల్లే ఉంది. ఉందిలే కట్టుకుపోయినంత ఆస్థి ముండకు—ఆ సీతాపతికి అదేగా కొత్తయిల్లు కట్టించి ఇచ్చిందీ! మీకు తెలీదుటగానీ, చెప్పకూ? దాని డబ్బేనా?"

రెండు చేతులతోనూ, నా నడుము రెండువేపులా పట్టుకొని, ఊపుతూ అడిగింది.

ఎంత బుద్ధిహీనుణ్ని! రామచంద్రం మాటవిని రాకుండా ఉండవలసింది.

నేను మాట్లాడకపోవటం చూసి, నరుసు చప్పున నన్ను కావిలించుకుని బావురుమని ఏడిచింది. ఏమనేది? ఎట్లా వోదార్చేది? ఎంతో ప్రయత్నంమీదే నరుసును ఊరుకోబెట్ట గలిగాను. అయితే ఆమెలోని అనుమానాన్ని తీసివెయ్యలేక పోయినాను.

## ౨

నరుసుమాట విన్న తరవాత నాకా శకుంతలను ఒకసారి చూడాలనిపించింది. ఇంత క్రితం వరకూ నాకా ఉద్దేశమే లేదు. ఆ తెల్లవారి మమూలు

తోవ తప్పించి అటు వేపుగా వెళ్ళేను. మా ఆవిడ చెప్పిన గుర్తులనుబట్టి అది శకుంతల ఇల్లేనని రూఢి చేసుకున్నాను. వీధి చివర ఉంది. పక్కకు వెళ్ళి చూస్తే పాడుబడ్డ దొడ్లు, ఆమె పెరటిలో జామచెట్టూ, చిన్న మొండి గోడా ఉన్నాయి. శకుంతల కోసం వచ్చేవాళ్ళు ఈ గోడదూకే వొస్తారనుకున్నాను.

ఆ సాయంత్రమే సీతాపతి కొత్తగా కట్టించిన ఇంటివేపు పోయాను. ఈ రోజుల్లో అథమం పదిహేనువేల రూపాయల ఖరీదు చేస్తుంది. సీతాపతి ఎంత అదృష్టవంతుడో! అటువంటి ఛాన్సు నాక్గూడా తగలగూడదూ?

మా ఆవిడ అన్నదాన్నిబట్టి చూస్తే, శకుంతల మంచి అందగత్తెనని తేలుతోంది. శృంగారానుభవం కోసం "డబ్బు"ను విచ్చల విడిగా ఖర్చు చేస్తుందనీ తెలిసిపోయింది. డబ్బు మాట దేవుడెరుగు, శకుంతలన్నా చిక్కితే. నేను నీతివంతుణ్నని ఎక్కడా ఎవరితోనూ అనలేదు...పోనీ, ఏ సుకృతం వల్లనో నాకీ శకుంతల దొరకగూడదూ?

ఆఫీసుకెళ్ళే దోవ మార్చాను యిటువేపుకు. నాలుగైదు రోజులకు నా తపస్సు ఫలించింది. అదృష్టవశాత్తూ నా కళ్ళు "జిగాలు" మనలేదు. అట్లా అన్న పక్షంలో ఆమెను చూడలేక పోయేవాణ్ని. ఎందుకంటే ఆమె నిమిషంసేపు కంటే వీధిలో నిలబడలేదు. ఈ అదృష్టం ఇంతటితో ఆఖరేమో అనుకున్నాను. కాలేదు. ఉదయమూ, సాయంత్రమూ, శకుంతల నాకు మొదట వీధిలోనూ, తరవాత దొడ్లోనూ కనపడసాగింది.

ఒకసారి వొస్తున్నాను. దొడ్డి గోడదగ్గిర కనిపించింది. చూస్తూనే వీధి మలుపు తిరిగాను. పదేళ్ళ కుర్రాడు వాకిట్లో నిలబడి నేను కనపడగానే, "రండి" అన్నాడు.

"ఎందుకు?"

వెధవ ప్రశ్న. ఎందుకేమిటి? ఆ యింట్లోకి ఎట్లా ప్రవేశమా అని తహతహలాడే నాకు ఆ ప్రశ్న రావటం—మానవ స్వభావమే అంత! దూరంనుంచి కోరి, కలలు కని, ఆశించి, ఎప్పుడో, ఎందుకో, దగ్గరికి వొస్తే ఆ అపురూప రాజ్యాలు, లావణ్యాలు అందుకోక, ఎందుకు? ఏమిటి? ఎవరు? అని సొల్లు ప్రశ్నలు వేసుకోవటం—ఎంత అవివేకం!

"ఈ తాళం రావటల్లేదు. కొంచెం..." అంటున్నది శకుంతల.

మిత్రుడు ఏడీ? ఏమయినాడు? ఎటు వెళ్ళాడు? నా కెందుకూ భయం ఆమెకే లేనప్పుడు?

"ఏం తాళం?" అంటూ ఆమె వెంట నడిచాను.

నమ్ముతున్నావా? ఆమె వెంట, తల్లివెంట కొంగుబుచ్చుకు నడిచే పాపవలె, మాట్లాడక, ఎటూ చూడక—ఆమె వీపు చలనంనుంచి దృష్టితిప్పి, లోపలి గదిలోకి, గొప్ప పందిరి మంచం గదిలోకి, తెల్లపరుపు దగ్గిరికి—ఎందరో ప్రియులు శకుంతలకు, స్వర్గతుల్యానుభవాలను ప్రసాదించిన ఆ పక్క-వద్దకు, మాటలురావు. లేవు. మెల్లిగా తలెత్తి, దేవతవలె, భానుస్పర్శకు వికసించే తామర మొగ్గవలె, కనురెప్పలు పైకిలాగి, నావేపు చూపులు. ముందుకు నడిచాను. ఏ గొప్ప ఉద్రేకమో, ఆమెను, నా దగ్గరికి చేర్చింది. ఆమెలో రగిలి ఆమెవీపు వెనక బిగుసుకునే నా చేతులు, నా మెడ నరాలలోంచి, నా రక్తంలోకి, నిప్పు చినుకులు, ఆమె వేళ్ళ చివర్లనుండి. ఆమె రొమ్ములు వర్షించే విద్యుత్కణాలు; మెడ వొంపుమీద పడే మెత్తటి జుట్టును, తెల్లని భుజాల ఎత్తుల్ని కప్పే రవికను, శరీరాన్నంతనూ తాకుతో, ఆమెను కావలించుకుని, చుట్టుకున్న చీరెను చూసి అసూయ. అవన్నీ నేనే అయి, ఇంక ఎవరికీ ఏమీ మిగలకుండా, ఆక్రమించి, నా అంతరాంతరాల్లోకి లీనం చేసుకుందామనే గాఢవాంఛ. ఓ చిన్న ఊపుతో తూలి, తెల్లని, మెత్తని పక్క-మీదకు. ఇంతవరకూ ఉన్న రెండు శరీరాలూ, మాయమయి, ఒకటే అయినందుకు గావును, బల్లి కదలకుండా చూస్తోంది.

ఆఫీసు లేకపోతే, చుట్టూ జనం మాయమైతే, ఇంట్లో కాలెండరు ఉండకుండా ఉన్నట్లయితే, రోజులే తెలీవు. డబ్బు అవసరాన్ని కలిగించే ఆకలి, పనీ, తప్ప ఇంక సంబంధమే లేదు లోకంతో నాకు. వారం, రెండు, మూడు, గడిచిపోతున్నాయి. జీవితానికి, మెరుగులు మేపి, అర్థాలుచెప్పి, స్వర్గాలు చూపి.

నరుసా? దానిసంగతే తెలీదు నాకు. ఆఫీసుపని—శకుంతల. ఇల్లా? తిండికోసం—అదీ కొన్ని కొన్ని సార్లు. నరుసు యిల్లూ సాయంత్రమే మాయమయి ఉదయం కనిపిస్తున్నందుకు ఊరుకుంది. ఎన్ని చెప్పినా మారవని గాబోలు... అసలు ఈ సుందర వరప్రసాదిని నరుసేగదా! శకుంతల మోహా బంధాన్ని చూపించింది ఆమేగదా నాకు? కోపంవల్లనే గానీ...

ఇంకా వెన్నెల రాలేదు. ఆ చిన్న గోడను దూకి, జామచెట్టు పక్కగా నడుస్తున్నాను...చచ్చాను...ఎవరో నా చెయ్యి పట్టుకుని వెనక్కు లాగారు.

"ఎవరు ?"

చప్పున వీపువేపుకు తిరిగి నన్ను పట్టుకున్న చేతిని అదిమి...గాజులు... మృదుత్వం...కొత్త యిస్త్రీ చీర పరిమళాలు, నాకు అలవాటయిన లావణ్య పరిమళాలు.

"శకూ !"

"ఊఁ"

రెండు చేతులతో దగ్గిరిగా తీసుకుని, హత్తుకుని, మెడ నునుపుమీద, కాలే పెదిమలమీద ముద్దులు. ఆమె చెంపలను నా గుండెలకు అద్దుకున్నాను. ముఖానికి ఆనించుకున్నాను.

"ఇక్కడ...?"

ఇక మాట్లాడకుండా నా పెదిమలు మూసిన ఆమె ఎఱ్ఱని చిన్న నోరు. ఆ పట్టునుండి విడిపించుకుని "ఇంటోకి" అన్నాను.

"వొద్దు"

"వొద్దా ? ఏం ?"

"మావాళ్లు—చుట్టాలొచ్చారు ఇందాక. యీ రోజు, రేపు, ఇంతే! తరవాత..."

ఒక గాఢాలింగనం. చెంపమీద కాలే ముద్దులు. మెదడునుండి, వెన్నెముకనుండి, తిమ్మిరింతల చలనం, రెండు రోజులు! ఎంత దుర్భరం! ఈ చుట్టాలను నరికితే! ఏ భూకంపమో వచ్చి, ఉదయానికల్లా ఛస్తే! ఒక రాత్రి వియోగంతోనే పోతుందిగదా ?

"అరుగో అయింది గావును అన్నం తినటం. తలుపు తీసుకు వస్తున్నారు వెళ్ళండి."

కదలలేదు.

"తొరగా— వెళ్ళండి"

మరో నాలుగు ముద్దులు. మెల్లగా గడ్డం ఊయించి, చప్పున దూకిపోయింది ఇంటివేపు. ఎంతసేపో, ఆ స్పర్శలు తలుచుకుని, బాధపడి, చేసేదిలేక యిల్లు చేరుకున్నాను.

## 3

"ఇప్పుడొచ్చారా ?" నరుసు గొంతు.

ఉదయమే తప్ప రాత్రి మధ్యన రావటం అలవాటు లేనందుకు నరుసు ఆశ్చర్యపడుతున్నది. ఏదో అనబోతున్నాను. ఎట్లా చూసిందో నన్ను తలుపులు వేసి ఉన్నప్పటికీ ?

"రావొద్దూ...ఈ పూటేగా కొంచెం ఆలస్యమయింది!"

లోపల ఎవరిదో కంఠం ! పురుష కంఠం !

నెత్తురు ఆగి, కాళ్ళు తేలి, తలుపు దగ్గిరికి వొచ్చాను. తలుపు కొట్టే బలం గూడా లేదు చేతుల్లో, ఆ కంఠం వినపడగానే.

"నీ కోసం ఎంతసేపణ్నుంచనీ ఎదురు చూడటం ? కళ్ళు మంటలు పుడుతున్నాయి" నరుసు గొంతు.

ఒక్కదూకు దూకి, దాని కంఠాన్ని నులమనా ? గుండెల్లో గడ్డపలుగు దింపి "హారోం హర హర" అని కేకలు పెట్టనా ? గొంతుమీద కాలుబెట్టి, చక్కని నున్నని...ఛీ...నొక్కి, రక్తం ఆగి, ముఖం నల్లబడుతుంటే, కళ్ళు జిల్లేడు పూలలా వెళ్ళుకొస్తుంటే, నాలిక పైకి సాగుతుంటే, వూపిరి ఆడక, కాళ్లు చేతులు విలవిల తన్నుకుంటుంటే నేను, సంతోష ధ్యానాలు చేసేదా?

వాడు అంటున్నాడు. "ఈ కొంచెం ఆలస్యానికేనా ? అటువంటి దానివి ఆరు నెలలు ఎట్లా భరించావు నువ్వు ?"

ఆహా ! దుర్విధీ !

"తప్పదు గనుక" అన్నది నరుసు.

"ఎప్పటికీ తప్పకపొయ్యేదే నీ మొగుడు..."

మధ్యలో "వాడిబొంద" అన్నది నరుసు.

"మొగుడు ఆ శకుంతల దగ్గరకు పోకుండా ఉన్నట్లయితే!" అంటున్నాడు వాడు.

ఒరేయ్! వెధవా! నిన్ను డొక్కలో తన్ని, పోనీ, నరికి, నీ రక్తం దోసిళ్ళకొద్దీ తీసికొని విడుపుతాను. పోను; పోను. ఆ శకుంతల వొద్దు నాకు. కానీ ఆ అందమైన, వెచ్చని ఆ ఆలింగనం, విద్యుత్ చుంబనం, చెవిలో రహస్యం, వక్షుపుస్పర్శ. ఎట్లా వదలను? శకుంతలను? నరుసును?

"అందుకేగదా ఆయన్ని, శకుంతల దగ్గరకు వెళ్ళేట్లు చేసింది. ఏమీ తెలీని ఆయనకు, శకుంతలవేపు దృష్టి మళ్ళించింది!"

"అదృష్టం..." అంటున్నాడు వాడు. నిజమేమరి! ఎట్లా కాదనను?

"ఇస్...వొదలండి...ఎముకలు — విరుగుతున్నాయ్...ఛీ...ఛీ... ఓహ్."

లోపలనుండి నరుసు గొంతు.

గాజుల చప్పుడు.

తలుపు కొట్టబోయి బలంలేక, ద్వారబంధం పట్టుకుని, వొదలలేక బైట నేను నిర్జీవంగా!